క్లుప్తంగా

మూలపెద్దమ్మకు ప్రత్యేక పూజలు



దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం పట్టువస్త్రాలు, పుష్పాలతో అలంకరించి నైవేద్యం సమర్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

మాజీ సైనికుల సంఘం నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని మాజీ సైనికుల కార్యాలయంలో ఆదివారం డివిజన్ స్థాయి యూనియన్ ఎన్నికలు నిర్వహించారు. ప్రభుదాసు ప్యానల్‌పై రంగనాయకులు ప్యానల్ ఘన విజయం సాధించింది. అధ్యక్షుడిగా చిన్న రంగనాయకులు, ఉపాధ్యక్షుడిగా రామరాజు, సెక్రటరీగా గురువయ్య, ట్రెజరర్‌గా జయరావు ఎన్నికయ్యారు. చిన్న రంగనాయకులు మాట్లాడుతూ నంద్యాలలో మిలటరీ క్యాంటీన్ ఏర్పాటుకు, మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

ఉచిత వైద్య శిబిరం



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ మధుసూదనరావు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక సాయి బాలాజీ నర్సింగ్ హోంలో ఐఎంఏ సహకారంతో డాక్టర్ హరినాథరెడ్డి, డాక్టర్ లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, నంద్యాల ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ మధుసూదనరావు హాజరై మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ ద్వారా పేద ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. అనంతరం 300 మంది రోగులకు రూ.లక్ష విలువైన ఊపిరితిత్తుల పరీక్షలు, స్కానింగ్, రూ.4లక్షలు విలువైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు విజయభాస్కరరెడ్డి, ఫణిల్‌కుమార్, వివేకానందరెడ్డి, శివ, విజయ్, ప్రవీణ్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలను జయప్రదం చేయండి

శ్రీశైలంప్రాజెక్ట్: సీపీఎం నంద్యాల జిల్లా రెండవ మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ మండల కన్వీనర్ మునిపాటి చిన్నమారెన్న, అధ్యక్షుడు దర్శనం నాగరాజు పిలుపునిచ్చారు. ఆదివారం సున్నిపెంటలోని పార్టీ కార్యాలయంలో కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ నంద్యాలలో ఈనెల 9, 10వ తేదీలలో జరిగే మహాసభలకు కార్మికులు, కర్షకులు, రైతు కూలీలు, రైతులు, మేధావులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం.మల్లికార్జున, నాగ వెంకటేశ్వర్లు, పోలయ్య, రంగస్వామి, వెంకటస్వామి, అవులయ్య తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందేలా చూడాలి

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని ప్రభుత్వ బాలుర సంక్షేమ హాస్టల్‌ను ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు లక్ష్మయ్య, స్థానిక నాయకులు ఆదివారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లల్లో పిల్లలకు పౌష్టికాహారం అందేలా చూడాలని అధికారులను కోరారు. శ్రీశైలంలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టల్‌లో వార్డెన్, పిల్లలకు వడ్డించిన మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించమన్నారు. భోజనం సంతృప్తికరంగా ఉందని, అన్ని హాస్టళ్లో కూడా నాణ్యతతో కూడిన పౌష్టికాహారాన్ని, మెనూ ప్రకారం అందేలా చూడాలని సంక్షేమ శాఖ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.

కాలభైరవుడికి అభిషేకార్చనలు



కాలభైరవ స్వామి

మహానంది: నవనందుల్లో ఒకటిగా విరాజిల్లుతున్న సూర్యనంది క్షేత్రంలో కొలువైన శ్రీ కాలభైరవ స్వామికి కాలభైరవాష్టమి సందర్భంగా ఆదివారం రాత్రి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కృష్ణ శర్మ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకుని శ్రీ కాలభైరవ స్వామికి పంచామృత అభిషేకం, మహా మంగళ హారతులు, వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేక, అర్చనలు జరిపారు. స్వామివారికి ఇష్టమైన నైవేద్యం సమర్పించి పూజలు చేశారు.

ధర డమాల్

- వరిధాన్యం బస్తాకు రూ.500 తగ్గుదల
- నాడు రూ.2,100
- నేడు రూ.1,500కు పడిపోయిన ధర
- రైతన్నల ఆవేదన



మైదానంలో ఆరబోసుకున్న ధాన్యం

శిరివెళ్ల: ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యంకు గిట్టుబాటు ధర లభించడం లేదు. అతి వృష్టి, అనావృష్టికి తట్టుకుని పండించిన ధాన్యానికి ఈ ఏడాది సరైన ధర లభించకపోవడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శిరివెళ్ల మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 6,500 హెక్టార్లలో వరి పంట సాగు చేశారు. ఎకరానికి సరాసరి రూ. 35 వేలకుపైగానే పెట్టుబడి పెట్టారు. పంట పండింది కాని ధర మాత్రం డమాల్‌మని తగ్గిపోయింది. ఎకరానికి 35 బస్తాల నుంచి 40 బస్తాలు దిగుబడి వస్తుంది. పెట్టుబడి కూడా రాదని రైతన్నలు ఆవేదన చెందుతున్నారు. కూలీలు, పురుగుల మందుల ధరలు పెరిగిపోతున్నాయని ధాన్యంకు ధర మాత్రం లేదని వాపోతున్నారు.

గతేడాది జాక్‌పాట్

2023 ఖరీఫ్‌లో వరి ధాన్యం ధర రైతన్న ఊహించని విధంగా పెరిగింది. వరి కోతల సమయంలోనే బస్తా (75 కేజీల) రూ. 2100 పైనే పలికింది. నిల్వ చేసుకున్న 7 నెలలకు దక్కాల్సిన ధర కేవలం పంట కోత సమయంలోనే రైతన్నకు లభించింది. ఎకరానికి 40 బస్తాలు దిగుబడి రావడం, ధర అమాంతంగా అబ్బడం రైతన్న పంట పండిపోయింది. ఎకరానికి రూ. 84 వేలు ఆదాయం వచ్చింది. పెట్టుబడి పోను ఎకరానికి రూ. 40 వేలుపైనే రైతన్నకు మిగిలింది. ఈ ఏడాది మాత్రం పరిస్థితి తలకిందులైంది.

కౌలు రైతన్న అప్పులపాలే

సొంత పొలం ఉన్న రైతన్న పరిస్థితే గగనంగా ఉంటే కౌలు రైతు పరిస్థితి మరింత దయనీయంగా మారింది. గతేడాది దిగుబడి బాగా రావడం, ధర ఊహించని విధంగా ఉండడంతో ఆ రైతు సంతోషం చెందాడు. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి ఉంటుందన్న గంపడాశతో పోటీపడి ఎకరానికి 14 నుంచి 18 బస్తాలకు పొలాలలను కౌలుకు తీసుకున్నారు. ఎకరానికి 38 నుంచి 40 బస్తాలు దిగుబడి వచ్చినా కౌలు పోను రైతుకు మిగిలేది కేవలం 25 నుంచి 22 బస్తాలే. కౌలు, పెట్టుబడి పోను రైతుకు మిగిలేది అప్పులే. ఒక్కో రైతు 10 ఎకరాల నుంచి 20 ఎకరాలకు పైగానే కౌలు భూమి తీసుకుని వ్యవసాయం చేశాడు.

పిల్లలకు సెల్‌ఫోన్లు ఇవ్వొద్దు



పల్లెనిద్ర కార్యక్రమంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటేష్

దొర్నిపాడు: ఇళ్ల వద్ద పిల్లలకు సెల్‌ఫోన్లు ఇవ్వద్దని ఎస్ఐ వెంకటేష్ సూచించారు. మండలంలోని కొండాపురం గ్రామంలో ఆదివారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ వాడకం వల్ల మానసికంగా ఇబ్బందులు వస్తాయన్నారు. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడబడితే అక్కడ బహిరంగంగా మద్యం సేవిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రంకెన్‌డ్రైవ్ చేస్తూ పట్టుబడితే జైలు శిక్ష తప్పదన్నారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా అపరిచితులు ఫోన్ చేసి ఆధార్ నంబర్, ఓటీపీ, ఏటీఎం పిన్ నంబర్ అడిగితే చెప్పవద్దన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదాలు అధికం అవుతున్నాయన్నారు. ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారని తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ముఖ్యంగా గ్రామంలో ఎమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

నేడు ఎస్‌పీజీ చర్చి వార్షికోత్సవం





ముత్యాలపాడు చర్చిలో షేఫర్డ్ సమాధి వద్ద ప్రార్థనలు, కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో ఎస్‌పీజీ చర్చి 134వ వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు చర్చి ఫాదర్ రెవరెండ్ ఆర్‌ఏఈ సంజీవ్ తెలిపారు. ముఖ్య అతిథులుగా కర్నూలు ఆర్‌ఆర్ నగర్‌కు చెందిన డీసీ రెవరెండ్ టీఎస్ ఇస్సాక్ ప్రసన్న కుమార్, ముత్యాలపాడు చర్చి డీసీ వైస్ ప్రెసిడెంట్ వరప్రసాద్‌రావు హాజరవుతారని చెప్పారు. చర్చి నిర్మాణాన్ని 1893లో క్రిస్టియన్ మత బోధకుడు స్వర్గీయ రెవరెండ్ రిచర్డ్ డెండీ షేఫర్డ్ చేపట్టారు. ఆయన 1877 నుంచి 1912 వరకు 35 సంవత్సరాల పాటు చర్చికి, ముత్యాలపాడు గ్రామానికి సేవలందించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే మొట్టమొదటి ఎస్‌పీజీ పాఠశాలను ముత్యాలపాడు గ్రామంలో ఆయన ఏర్పాటు చేశారు. 1912లో ఆయన అనారోగ్యంతో మృతిచెందారు. చర్చి ఆవరణలోనే ఆయనను ఖననం చేసి సమాధిని నిర్మించారు. వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం చర్చి ఆవరణలో ఉన్న షేఫర్డ్ సమాధిని పూలతో అలంకరించారు. చర్చి ఫాదర్ సంజీవ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు.

వైభవంగా చండీ హోమం





అయ్యప్పస్వామికి పుష్పాభిషేకం చేసిన దృశ్యం, చండీ హోమం పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గుడిపాటి గడ్డలో వెలసిన శ్రీస్వామి అయ్యప్ప దేవస్థానం 45వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని రెండో రోజు ఆదివారం ప్రత్యేక హోమాలు నిర్వహించి పూర్ణాహుతి గావించారు. ఉదయాన్నే స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు జరిపించి పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం శ్రీలక్ష్మీ గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర, అయ్యప్ప, నవగ్రహ చండీ, హోమాలు పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా చేపట్టి మహా పూర్ణాహుతి గావించారు. సాయంత్రం ఆయుధ పూజా నిర్వహించి జ్యోతి ప్రజ్వలన చేశారు. అలాగే మూలవిరాట్‌కు పుష్పాభిషేకం చేయించారు. మహామంగళ హారతులు ఇచ్చి ప్రసాద వితరణ గావించారు. అయ్యప్ప సేవా సమాజ్ సభ్యులు మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, శ్రీకాంత్, గంగాధర్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

బెస్త సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా శివ

నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన బెస్త పుట్ట శివకుమార్ ఏపీ సంప్రదాయ మత్స్యకార కులాల సంక్షేమ సమాఖ్య రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ఎన్నుకున్నట్లు ఆదివారం ఆయన తెలిపారు. విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి నూతన కమిటీలో జాయింట్ సెక్రటరీగా ఎన్నుకున్నారని చెప్పారు. బెస్తల అభివృద్ధికి తనవంతుగా తోడ్పడతానన్నారు. గతంలో పట్టణ అధ్యక్షుడిగా పని చేశానని చెప్పారు.

జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 19వ తేదీన విజయవాడలో జరిగే ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ అండ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. ఆదివారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుశీలమ్మ, ఆళ్లగడ్డ కార్యదర్శి ధనలక్ష్మి, నాయకులు రామకృష్ణ, రాము, శివమ్మ, శేఖర్, మల్లేష్ పాల్గొన్నారు.

క్రీడా పోటీలు

నంద్యాల(న్యూటౌన్): క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని హోలీక్రాస్ కెథడ్రల్ పాస్టరేట్-2(ఆల్‌సెయింట్ చర్చి) డీనరీ చైర్మన్ ఇమ్మానియేల్, సెక్రటరీ కిరణ్‌కుమార్, బాలయ్య, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6గంటల వరకు క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీలను డీనరీ చైర్మన్ ఇమ్మానియేల్, గురువులు విజయ్‌కుమార్, జోయల్ ప్రారంభించారు. షాట్‌పుట్, ఫుట్‌బాల్, కబడ్డీ, మహిళలకు క్రీడా పోటీలను నిర్వహించారు. విజేతలకు క్రిస్మస్ పండుగ రోజు బహుమతులు అందజేస్తామని చెప్పారు. కాగా అన్ని గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. సెమీ క్రిస్మస్, క్యాండిలైట్ సర్వీస్, క్రీడా పోటీలతో క్రిస్మస్ సందడి నెలకొంది.

నేడు రెవెన్యూ గ్రామసభ

దొర్నిపాడు: మండల కేంద్రం దొర్నిపాడులోని కోట స్కూల్‌లో సోమవారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సుభద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భూ సమస్యల పరిష్కారం కోసి నిర్వహిస్తున్న గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్జీలను స్వీకరించి క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కారం చూపుతామన్నారు.

భారీగా పోలీసుల బదిలీ

బండి ఆత్మకూరు: స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి భారీగా పోలీసులు బదిలీ అయ్యారని ఎస్.ఐ. జగన్ మోహన్ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. సాధారణ బదిలీల్లో భాగంగా స్టేషన్ నుంచి ఇద్దరు ఏఎస్ఐలు, ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లు, ఎనిమిది మంది కానిస్టేబుళ్లు వేర్వేరు ప్రాంతాలకు బదిలీ అయ్యారన్నారు. వీరి స్థానంలో కొత్త సిబ్బంది త్వరలోనే వస్తారని వెల్లడించారు.

వివాదాస్పదం.. మినీగోకులం నిర్మాణం



ఎల్లావత్తులలో నిర్మిస్తున్న గోకులం షెడ్డు

రుద్రవరం: మండల పరిధిలోని ఎల్లావత్తులలో నిర్మిస్తున్న మినీ గోకులం షెడ్డు వివాదాస్పదంగా మారింది. షెడ్డు నిర్మించే స్థలం వీరభద్రస్వామి మాన్యం అని కొందరు..గ్రామ కంఠం అని మరొ కొందరు చర్చించుకుంటున్నారు. అయితే మాన్యం భూమి అయినా గ్రామ కంఠం అయినా ఆయా శాఖల అధికారుల అనుమతి లేకుండా రెవెన్యూ అధికారులు పొజిషన్ సర్టిఫికెట్ (ధృవీకరణ పత్రం) ఎలా ఇస్తారని విమర్శిస్తున్నారు. ఎల్లావత్తులకు చెందిన ఓ రైతుకు ఇటీవల అధికారులు మినీ గోకులం షెడ్డు మంజూరు చేశారు. ఆ రైతుకు స్థలం లేకపోవడంతో ఆయన తరఫున బినామిగా మరో రైతుకు అప్పగించారు. ఆ బినామి రైతు గ్రామం నుంచి బీరవోలు వెళ్లే దారిలో ఖాళీగా ఉన్న స్థలంలో షెడ్డు నిర్మాణ పనులు సాగిస్తున్నాడు. అయితే షెడ్డు నిర్మించే స్థలం ఎల్లావత్తులకు చెందిన ఓ కుటుంబ పూర్వీకులు దీబగుంట్ల వీరభద్ర స్వామి ఆలయానికి మాన్యంగా ఇచ్చారని గ్రామస్తులు తెలిపారు. ఆ మాన్యం భూమిలో ఇష్టానుసారంగా శాశ్వత కట్టడాలు నిర్మిస్తున్నా దేవదాయశాఖ అధికారులు తమకేమి తెలియదన్నట్లు మిన్నకుండిపోయారు. ఈ విషయంపై కోటపాడు గ్రూపు దేవస్థానాల ఈఓ వేణునాథరెడ్డిని వివరణ కోరగా.. దీబగుంట్ల వీరభద్ర స్వామి ఆలయానికి 98 సెంట్ల మాన్యం ఉందేది వాస్తవమే అన్నారు. ఆ స్థలంలో కట్టడాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి రాలేదన్నారు. గ్రామానికి వెళ్లి పరిశీలిస్తామని.. స్థలం వివాదాస్పదం అయితే వెంటనే సర్వే చేసేందుకు రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేస్తామని తెలిపారు.

శ్యామ సుందరుడు ఇకలేరు



శ్యాంరావు(ఫైల్)

దొర్నిపాడు: అతను దివ్యాంగుడు.. అసలు పేరు లింగాల శ్యాంరావు.. అందరూ పిలుచుకే పేరు శ్యాంసుందరుడు. చిన్నప్పుడు పోలియో సోకి గూనిగా అయిపోయాడు. ఏ పని చేయాలన్నా ఇబ్బంది పడేవాడు. ఓసారి అతని పరిస్థితి చూసి స్థానిక నాయకులు ఎంపీడీఓ కార్యాలయంలో ఎదైనా పని కల్పించి నెలకు ఎంతోకొంత ఇవ్వాలని అధికారులను కోరారు. అతని ధీనస్థితిని చూసిన అధికారులు నెలకు కొంత నగదు ఇచ్చేవారు. ఇలా 18 ఏళ్లుగా అటెండర్‌గా విధులు నిర్వహిస్తూ అందరికి సుపరిచితుడిగా మారాడు. అధికారలు ఇచ్చే నగదుతోపాటు ప్రభుత్వం అందిస్తున్న రూ.6వేల పింఛన్‌తో తల్లిదండ్రులకు అండగా ఉండేవాడు. ఆదివారం సెలవు కావడంతో ఉదయం ప్రార్థనకు వెళ్తూ గుండెపోటుతో శ్యాంరావ్(41) మృతి చెందాడు. ఏడేళ్ల క్రితం రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోలుకున్న ఆయన్ను చాలా మంది నువ్వు ఎంతో అదృష్టవంతుడివి, బతికిపోయావంటూ అన్నారు. ప్రస్తుతం శ్యాం మృతి పలువురిని కంటతడి పెట్టించింది. ఎంపీడీఓ సావిత్రి, ఈఓపీఆర్డీ సులోచన, సిబ్బంది నివాళులు అర్పించారు.

లలితా బజార్ షాపుల కేటాయింపులో అవకతవకలు

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని లలితా బజార్‌లోని క్యూ, ఆర్ లైన్లో ఉన్న షాపుల కేటాయింపులో అవకతవకలు జరిగాయని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అరవింద్ రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు దేవస్థానం ఈఓకు, దేవాదాయ కమిషనర్‌కు, ఎన్డీఏ కూటమి పెద్దలకు లేఖలను రాసినట్లు ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దుకాణాల కేటాయింపులో అవకతవకలు జరిగినందున ఈ రెండు బ్లాక్‌లలో వ్యాపారులు కొందరు దుకాణాలు నిర్మించుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ విషయంపై దేవస్థానం ఈఓ దృష్టిసారించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

మహానందిలో అయ్యప్పల సందడి



ఆలయ మాడవీధుల్లో అయ్యప్ప మాలధారులు

మహానంది: మహానంది ఆలయంలో శనివారం రాత్రి నుంచి అయ్యప్ప దీక్షా స్వాముల సందడి నెలకొంది. శని, ఆదివారాల్లో వేలాది సంఖ్యలో అయ్యప్పలు తరలివచ్చారు. భక్తులు శ్రీ కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని పూజలు చేపట్టారు. సుమారు వందకు పైగా బస్సుల్లో అయ్యప్పలు తరలి వచ్చారు. బస్సుల వద్ద స్వామియే...అయ్యప్పో, స్వామి శరణం, అయ్యప్ప శరణం అంటూ స్వామి నామస్మరణ మారుమోగింది. అనంతరం మహానందీశ్వర స్వామిని దర్శించుకొని భక్తిశ్రద్ధలలో పూజలు చేపట్టారు.

నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు



నీలిషికారిపేటలో బెల్లం ఊట ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

నందికొట్కూరు: నాటుసారా తయారు విక్రయించినా, తయాలరు చేసినా చట్ట పరమైన కఠిన చర్యలు తప్పవని టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని నీలిషికారి పేటలో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లం ఊటను ఎస్ఐలు చంద్రశేఖర్, సురేష్ బాబు, ఓబులేసు, పోలీసులు ధ్వంసం చేశారు. 60 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు.

భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేస్తాం



హెచ్‌కొట్టాల రైతులతో మాట్లాడుతున్న డోన్ ఆర్డీఓ

బేతంచెర్ల: రైల్వే డబుల్‌లైన్ పనుల కారణంగా భూములు కోల్పోతున్న రైతులందరికీ నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని డోన్ ఆర్డీఓ నరసింహులు అన్నారు. మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామ సమీపాన నిర్మించే రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి వల్ల 2.85 ఎకరాల భూమిని కోల్పోతున్న 21 మంది రైతులతో ఆదివారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ఎకరాకు రూ.14 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇంకా నష్టపరిహారం పెంచాలనే రైతుల అభిప్రాయాన్ని కలెక్టర్, రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. అలాగే సిమెంట్ నగర్ గ్రామ సమీపాన నిర్మిస్తున్న రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి నష్ట పరిహారంపై పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యంతో ఆర్డీఓ చర్చించారు. ఆయనతో పాటు తహసీల్దార్ ప్రకాశ్ బాబు, ఆర్ఐ హేమంత్‌రెడ్డి, వీఆర్వోలు విజయలక్ష్మి, రమేష్ చౌదరి ఉన్నారు.

మహానందీశా..ఏమిటీ దుస్థితి!

- మహానంది క్షేత్రానికి రూ.కోట్లలో ఆదాయం
- భక్తులకు సౌకర్యాలు అంతంతమాత్రమే
- అరకొరగా వసతి గృహాలు
- బురదమయంగా పరిసరాలు



ఆలయ పరిసరాల్లో పరిస్థితి



నాగనంది వసతి గృహాల వద్ద దుస్థితి

మహానంది: రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో మహానంది ఒకటి. డిప్యూటీ కమిషనర్ స్థాయి హోదా కలిగిన మహానందికి ఏడాదికి ఆదాయం రూ. కోట్లలో వస్తుంది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రల నుంచే కాకుండా దేశ విదేశాల నుంచి నిత్యం వేలాది సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఇంత పెద్ద క్షేత్రంలోని ఆలయ పరిసరాలు ఆహ్లాదకరంగా ఉంటాయనుకుంటే మాత్రం పొరపాటే. ఆలయ ప్రాంగణంలో భక్తులకు కనీస వసతులు లేకపోగా ఆలయ పరిసరాలు బురదమయంగా మారడంతో భక్తులు నిరాశ చెందుతున్నారు. రూ.కోట్లు ఆదాయం వస్తుంటే కనీస వసతులు కల్పించలేరా అంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఏడాదికి రూ. 17కోట్లు ఆదాయం

మహానందీశుడికి ప్రతి ఏడాది రూ. 17కోట్లకు పైగా ఆదాయం వస్తోంది. మహానందీశ్వర స్వామికి గత ఐదేళ్లలో ఆదాయం అమాంతంగా పెరిగింది. 2018–19 ఏడాదిలో రూ. 9.99 కోట్లు ఆదాయం రాగా 2023–24లో రూ. 17.50కోట్లకు చేరింది. అంటే ఐదేళ్లలో ఆదాయం దాదాపు రెట్టింపయ్యింది. ఇంత మొత్తంలో ఆదాయం వస్తున్నా భక్తులకు కనీస వసతులు కరువయ్యాయి. భక్తులకు సరిపడా వసతి గృహాలు లేకపోవడంతో భక్తులు ప్రైవేటు లాడ్జీలను ఆశ్రయించాల్సి వస్తోంది.

మహానందిలోని నాగనంది, టీటీడీ వసతి గృహాల్లో అన్ని కలిపి కేవలం 43 వరకు మాత్రమే గదులు ఉన్నాయి. ఉన్న గదుల్లోనూ లీకేజీ అవుతున్న కుళాయిలు, పగిలిపోయిన టాయిలెట్లే దర్శనమిస్తున్నాయి. వీటిని చూసిన భక్తులు చేసేదేమిలేక ధర తక్కువ ఉండటంతో ఉండిపోవాల్సి వస్తుంది.

కార్యాలయం ఎదుటే కంపు

వర్షం వస్తే ఆలయ పరిసరాల్లోని నాగనంది వసతి గృహాలు, ప్రధాన కార్యాలయం, పోచా బ్రహ్మానందరెడ్డి డార్మెటరీ, పాపిరెడ్డి కాటేజీల ముందు బురదనీరు నిలిచిపోవడంతో కంపు కంపుగా మారాయి. ఆలయాభివృద్ధికి ప్రణాళికలు, మాస్టర్‌ప్లాన్ అంటూ ప్రకటనలు చేస్తున్న అధికారులకు ఆలయ పరిసరాల్లోని బురద కనిపించడం లేదా అంటూ భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నాగనంది వసతి గృహాల ముందు నెలల తరబడి నీళ్లు నిలిచిపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఇక్కడ అధిక సంఖ్యలో వివాహాలు జరుగుతుంటాయి. అయితే ఇక్కడి పరిసరాలను చూసి విసుగు చెందుతున్నారు.

అయ్యప్ప స్వాముల అవస్థలు

ప్రస్తుతం మహానంది ఆలయానికి అయ్యప్పదీక్ష స్వాములు వేలాది సంఖ్యలో వస్తున్నారు. అయ్యప్పలు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో ఏర్పాటు చేసుకునే భిక్ష (ఫలహార, భోజనాలు) తయారు చేసుకునేందుకు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. ఆలయ పరిసరాల్లో బురద ఉండటంతో రోడ్లపైనే వండుకుంటున్నారు. ఇటీవల మహానంది ఈఓగా బాధ్యతలు స్వీకరించిన నల్లకాలువ శ్రీనివాసరెడ్డిని స్థానికులు కలిసి ఆలయ పరిసరాలను పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆలయ పరిసరాల్లో బురదను తొలగించి, గుంతలను చదును చేసి ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యత ఇస్తాం



మహానంది ఆలయ పరిసరాల్లో బురద తొలగించేందుకు తగిన చర్యలు తీసుకుంటాం. వర్షం పడినప్పుడు నీరు నిలుస్తూ ఉంటుంది. నీరు నిలువ లేకుండా చేస్తాం. వెంటనే ఇంజినీరింగ్ విభాగం సిబ్బందికి చెప్పి భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. వసతి గృహాల్లోని కుళాయిలకు మరమ్మతులు చేసేందుకు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేశాం. వాటికి మరమ్మతులు చేయాలని సిబ్బందిని ఆదేశించాం. సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తీసుకుంటాం.

– నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, ఈఓ, మహానంది